# ప్రెసిడెంటు లక్ష్మీకాంతం

పంచాయితీబోర్డు ప్రెసిడెంటు నయాను. మనవూరు పట్నమే అయితే చైర్మను అంతటి వాణ్ణన్నమాట. ప్రెసిడెంటు కాగానే దండలేంటి ఒక పాతిక మెళ్ళో పడ్డాయి. కారంతా పూలదండలతో, ఇక్కలి పేర్లతో నిండి పోయింది. మాఆడ మనిషి సరదా ఇంతా అంతా కాదు. డ్రైవరు దండలన్నీ తెచ్చి సావిట్లో పడేశాడు. మా ఆడమనిషి దండలన్నీ విప్పి మా మంచం నిండా పరిచింది.

"ఇవాళ మనం నిజంగా పూలపాన్పుమీద పడుకుంటాం" అన్నది. దాని తెలివికి మెచ్చుకొన్నాను. ఇన్ని దండలూ గౌరవాన్నిచ్చినా దండుగే కదా! మా ఆడమనిషి వాటి విలువ కనబడేటట్లు చేసింది.

నే నింతవాణ్ణవుతానని కల్లో అనుకోలేదు. అన్నదమ్ములు చెప్పే పని, అనే మాటలు కష్టమనిపించి ఇల్లువదిలి పారిపోయాను. అప్పుడు నాకు పదమూడో ఏడు. అప్పటికప్పుడే అన్నం పాళంగా వార్చడం, కూరలు, పప్పు దప్పళం ఫస్టుగా చెయ్యడం నేర్చుకొన్నాను. బజ్జీలకు అరటికాయ తరిగితే నేనే తరగాలి. వంటపని ఎంతయినా సరదాగా చేసేవాణ్ణి, కానీ నీళ్ళమోతంటే చచ్చేవాడ్ని. అక్కడే అన్నలని తిరస్కరించి జానడంత పొట్ట పోషించుకోలేనా అని దౌడాయించాను.

ఎన్ని వూళ్ళు తిరిగానో, ఎన్ని రకాల పనులు చేశానో, మొత్తానికి ఎన్నడూ 'లేదూ' అన్నమాట జాతకానికి లేదు. ఆఖరికి మన వూరు చేరడం తొంటిమీదికి పద్దెనిమిదేళ్ళు రావడం ఒక్కమారయింది.

మీరెవరూ ఎరగరు. మన వూళ్ళో ఆ రోజుల్లో సారాపాకకెదురుగా కాఫీ హోటేలు. అక్కడ వంటమనిషిగా కుదురుకున్నాను. ఆ దుకాణం కాపుది. అతను తిండిపెట్టి పదిహేనురూపాయ లిచ్చేవాడు. రెండు సంవత్స రాలకల్లా నిలవచేశాను. నా రేఖ బయలుపడ్డాది.

నా అదృష్టానికల్లా ఇద్దరు కారణం. వాళ్ళకి ఆజన్మాంతం కృతజ్ఞుణ్ణి. ఇద్దర్లో మొదటిది ఒక ఆడది. రెండోది ఒక గొల్లవాడు.

గొల్లవాడు అభయహస్తమిచ్చాడు. "మూడురోడ్ల మధ్యని హోటేలు పెట్టండి. పడ్డపాలూ పెరుగూ నేను సప్లయి చేస్తాను. మీకు నష్టంరాదు. డబ్బు అందినప్పుడల్లా కరకటుగా పారేయండి" అన్నాడు.

ఆడమనిషి సారాదుకాణంలో ఉండే గమళ్ళది. అదంటే సారా కొట్టు కొచ్చే అందరికీ రంగే. దానికి నేనంటే రంగు. మొదట్లో అందరి లాగే నేనూ డబ్బు మేపే దాంతో వెళ్ళేవాణ్ణి. అందర్నీ బుట్టలో వేసు కొన్నట్టు నన్ను వేసుకోబోతూ అదే నా బుట్టలో పడ్డాది.

దానివల్ల నేను చెడిపోతున్నాననే అందరి అభిప్రాయం. కాని సర్గిగ్గా దానివల్లే నేను బాగుపడ్డాను. సారాకొట్టులో గుడిసేటుతో పొత్తేమిటి? దాంతో, చెడే అలవాట్లే సిద్ధమయాయి. ముందు దానింట్లో దూరడమే చెడ్డం. అక్కడితో ఆగిందా? అది సారా అమ్ముతుంది. తాగుతుంది. నాకూ అలవాటుచేసింది. కాని ఎన్నడూ తప్పతాగేది కాదు. తప్పతాగనిచ్చేది కాదు. దానిపడి రాత్రి రోజూ రెండు గళాసులు. సారాదుకాణంలో సానిగా ఉండి అదొక్కత్తే డబ్బుగణించింది. దాని దగ్గర డబ్బు మూలుగుతూ ఉండేది. సారా బలవంతంపెట్టి అదే అలవాటు చేసింది. కాని నా పని కూడా రాత్రి రోజూ రెండు గళాసులే.

ఆ గమళ్ళది అభయహస్తమిచ్చింది. "మూడురోడ్లమధ్య బ్రాహ్మణ భోజన కాఫీ హోటేలు పెట్టండి. మూడు వందలుకాదు. ఐదువందలైనా మదుపు నేనిస్తాను" అన్నది.

మనపూరికి మునసబుకోర్టు రావడమేమిటి, నేను హోటేలు పెట్టడమేమిటి, రెండూ అలాగ్గా కలిసొచ్చాయి. నేను ఇలాగా అలాగా హోటేలు పెట్టేనా? మన పూరులాంటి చిన్న పూళ్ళలో ఎక్కడా ఆపాటి హోటేలు ఆ రోజుల్లో లేదు. నేను దేశదిప్పకాయని. పనంతా తెలిసినవాణ్ణి. కుర్చీలు బేబిళ్ళు నిలువుటద్దాలు బోలెడంత సరంజాం కొన్నాను. పరిశుభ్రంగా పెట్టేవాణ్ణి. ఖచ్చితంగా డబ్బు పుచ్చుకునేవాణ్ణి.

ఆ రోజుల్లో పెద్దలు కాఫీ హోటల్లోకి రావడానికి ఇష్టపడేవారు కాదు. నామర్దా! పూటకూళ్ళ మెతుకులు బ్రాహ్మలకి ఆచారానికి పనికొచ్చేది

కాదు. చేదస్తం! అలాంటి పెద్దలంతా క్రమేణ ఆగిపోయారు. మేము చేసే టిఫిన్లకోసం తెల్లారీ సరికి ఎంగిలాకులమీద కాకుల్లాగ వాలేవారు. హోటల్లో ఈగలు మూగే టేబిలుచుట్టూ చేరే వాళ్ళనిచూస్తే నాకు ఎంగిలాకుల మీది కాకులు జ్ఞాపకమొస్తాయి. మళ్ళా నేను హోటేలు యజమానిని! ఆ పెద్ద లకి నాతో పరిచయం ఉందనుకోడం పెద్దగొప్ప. నేను రోడ్డుమీద కన బడితే చాలు "ఏమండో లక్ష్మీకాంతంగారూ" అంటూ హస్కు ప్రారం భిస్తారు. నాతో వాళ్ళకంత దోస్తీ ఉన్నాదని ఊళ్ళోవాళ్ళకి తెలియాలని వాళ్ళు పడేబాధ నాకు తెలుసు.

ఐదారేళ్ళయింది. మూడురోడ్లమధ్య రెండు ఇళ్ళు కొన్నాను. రెండూ విరగదీసి హోటేలుకి పనికివచ్చేటట్లు కిందా, కాపురానికి పని కొచ్చేటట్లు మీదా పెద్ద మేడకట్టాను.

దాంతో వూళ్ళో పెద్దల్లో నేనొకణ్ణయిపోయాను. మరి నాలుగేళ్ళ కల్లా పెద్ద ప్రొప్రయిటరు నయిపోయాను. ఊళ్ళో తగు మనుష్యులం, పలుకుబడికలవాళ్ళం, బాబులం అనుకొంటూన్న వాళ్ళకి పది పదిహేను వేల వరకూ ఇళ్ళమీదా నోట్లమీద బదుళ్ళు ఇచ్చాను. క్లబ్బు మెంబర్న యాను. అక్కడ కూచుని వాకీళ్ళు, డాక్టర్లతో సమానంగా పోకరు ఎవరా డినా తగు మనిషి అనిపించుకుంటాడు.

ఇంతట్లో బోర్డు ఎలెక్షనులు వచ్చేయి. నన్ను బజారు వార్డుకి నిల బడమన్నారు. 'చెయ్యెత్తు' అంటే చెయ్యెత్తే 'మెమెమ్మే'లతో నేనొకణ్ని అవుతానుకదా అని వొద్దుకాక వొద్దన్నాను. విన్నారా? నిలబెట్టేరు. బోర్డులో కెళ్ళేక బోర్డు మెంబర్లలో నాకన్నా దద్దమ్మలు ఎంతమంది ఉన్నారో అప్పుడు తెలిసింది. దిగితేకాని లోతు తెలియదు. ఏమిటో అనుకు న్నాను. రాచకీయాల్లో మప్పితే ఆడడానికి మనం చాలము. నీట్లోపడి కాళ్ళూ చేతులూ కొట్టుకోడం మొదలిడితే యీత దానంతటకదే వొస్తుంది. దిగిన తరవాత తెలివితేటలుండాలికాని బుర్రలుతీసి బుర్రలు మార్చడం చాలా తేలిక. దానికి పెద్ద చదువుకొన్నాం అనుకొనే ప్లీడర్లు-డాక్టర్లు కన్నా నాబోటిగాళ్ళే పనికొస్తారు. ఆ బొద్దు మీసాలాయ నున్నాడే అతనో

మెంబరు. ఎందుకూ? బి.యల్ ప్యాసయ్యాడు. కాని వుత్త ఫూల్! చదువుకొన్న వాళ్ళలోనే ఫూల్సు జాస్తీ!

ఇప్పుడు నా దగ్గరున్న ఆడమనిషిని చూస్తే మీరాశ్చర్యపోతారు. అది కట్టే చీరా, పెట్టుకొనే నగలూ, శరీరం నవనవా చూస్తూ వుంటే నా కళ్ళకే ఆశ్చర్యం వేస్తుంది. దాని పేరు వెనక గమళ్ళ గంగమ్మ. ఇప్పుడు గంగాదేవి అని పిలుస్తారు. దానివల్లే నేనింతవాణ్ణయ్యాను.

నా గంగ ఇప్పుడు రోజూ బ్రాందీ రెండు పెగ్గు లేస్తుంది. ఎండ వేళ దాహానికి ఒక ఐసులో పెట్టిన బీరు బుడ్డి కొడుతుంది. సరిగ్గా నాపనీ అంతే.